ఆంధ్రజ్యోతి
సంక్రాంతి శుభాకాంక్షలు
5
చిత్తూరు జిల్లా వార్తలు
సోమవారం 15 జనవరి 2024



‘భోగి’ వైభవం

జిల్లాలో ఆదివారం వేకువజామున ఇళ్లముందు భోగి మంటలు వేశారు. భోగిమంటల వెలుగుల్లో పల్లె, పట్టణాలు కొత్త కాంతిని సంతరించుకున్నాయి. చిన్నారులకు చెరకు గడలు, రేగుపళ్లు, పూలతో భోగిపళ్ల నలుగులు పెట్టి.. పెద్దలు ఆశీర్వదించారు.

- చిత్తూరు కల్చరల్

కాణిపాక ఆలయం వద్ద భోగి మంటలు వేస్తున్న అధికారులు



‘సంక్రాంతి’ సందడి

సంక్రాంతి పండుగ కొనుగోళ్లతో ఆదివారం చిత్తూరు నగరంతో పాటు జిల్లాలోని పట్టణాలు, మండల కేంద్రాలు పందడిగా మారాయి. సోమవారం నాటి పెద్ద పండుగ కోసం చెరకు గడలు, వివిధ సామగ్రి కొనుగోలు చేయడానికి రావడంతో దుకాణాల వద్ద రద్దీ నెలకొంది. మార్కెట్ వీధులన్నీ జనంతో నిండిపోయాయి. ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగాయి.

- చిత్తూరు కల్చరల్



చిత్తూరులోని చర్చివీధిలో కొనుగోళ్లు చేస్తున్న జనం

అంగన్వాడీల కడుపు మంటల సంక్రాంతి

కుప్పం, జనవరి 14: రాష్ట్రమంతటా సంక్రాంతి సంబరాలు మిన్నంటుతున్న వేళ అంగన్వాడీలు మాత్రం ‘కడుపుమంటల సంక్రాంతి’ జరుపుకొన్నారు. కుప్పంలో ఆదివారం ఉదయం భోగి మంటలు వేసి, ఆ మంటల్లో జీవో నెంబర్ 2 ప్రతులను, షోకాజ్ నోటీసులను దహనం చేశారు. యథావిధిగా తమ సమ్మెను కొనసాగించారు.ప్రభుత్వ తీరుతో తాము సంక్రాంతి పూట కూడా పస్తులుండాల్సి వస్తోందంటూ తమ కష్టనష్టాలను సూచించే నినాదాలతో రంగవల్లులు తీర్చిదిద్దారు. వాటి ఎదురుగా ‘సమాన పనికి సమాన వేతనం’, ‘ఆకలిమంటల ఈ పోరాటం’, ‘కడుపుమంటల సంక్రాంతి’ అని ముగ్గుతో రంగుల్లో వేసి నిరసన తెలిపారు. సీఐటీయూ నాయకురాలు లలిత, యూనియన్ల నేతలు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

పండగపూటా నిరసనలే

చిత్తూరు: జిల్లా వ్యాప్తంగా అంగన్వాడీలు ఆదివారం భోగి పండుగైనా నిరసన తెలిపారు. పలమనేరు, కార్వేటినగరం, నగరి తదితర ప్రాంతాల్లో ఎస్మా జీవో ప్రతులను భోగిమంటల్లో వేసి దహనం చేశారు. ప్రభుత్వం సంక్రాంతి పండగ రోజైనా తీపి కబురు చెబుతుందని అనుకుంటే చేదునే మిగిల్చిందని ఆవేదన వ్యక్తంచేశారు.



కుప్పంలోని భోగిమంటల్లో జీవో, షోకాజ్ నోటీసులు దహనం చేస్తున్న అంగన్వాడీలు



అంగన్వాడీల నినాదాలతో తీర్చిదిద్దిన రంగవల్లులు

కీడు తొలగాలి.. ఏపీ వెలగాలి

● టీడీపీ నేతల భోగి సంకల్పం ● జీవోల ప్రతుల దహనం

చిత్తూరు సిటీ, జనవరి 14: కీడు తొలగాలి.. ఏపీ వెలగాలి అంటూ టీడీపీ నాయకులు నినాదాలు చేశారు. చిత్తూరులోని జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆదివారం నేతలు ప్రభుత్వ జీవోల ప్రతులను భోగి మంటల్లో వేసి ‘భోగి సంకల్పం’ కార్యక్రమాన్ని జరుపుకొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ దొరబాబు మాట్లాడుతూ.. ‘ఈ నెల 16వ తేదీన 17ఏ కేసు రద్దయ్యే అవకాశముంది. ఆ రోజు విడుదలయ్యే సుప్రీంకోర్టు జడ్జిమెంట్ నుంచి టీడీపీ దశ దిశ మారుతుంది. 16వ తేదీన పార్టీ శ్రేణులంతా జిల్లా టీడీపీ కార్యాలయానికి వచ్చి సంబరాలు జరుపుకోవాలి’ అన్నారు. ‘సీఎం జగన్ విడుదల చేసిన అన్యాయ, కుట్రల జీవోలన్నీ ప్రతి ఏడాదిలాగే భోగి మంటల్లో వేసి పండుగ చేసుకుంటున్నాం. ప్రజలకు మంచి పాలన రావాలని కోరుకుంటున్నాం. రాబోయే ఎన్నికల్లో వైసీపీ భోగి మంటల్లో కాలిపోతుంది. టీడీపీ-జనసేన కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది’ అని మాజీ మేయర్ హేమలత పేర్కొన్నారు. కీడు తొలగాలి.. ఏపీ వెలగాలి, సైకో పోవాలి.. సైకిల్ రావాలి.. అంటూ నాయకులంతా కలిసి నినాదాలు చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు కాజూరు బాలాజీ, నాయకులు సురేంద్రకుమార్, మోహన్‌రాజ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగానూ టీడీపీ నాయకులు జీవోల ప్రతులను భోగి మంటల్లో దహనం చేశారు.



చిత్తూరులోని జిల్లా టీడీపీ కార్యాలయంలో నాయకుల భోగి సంకల్పం కార్యక్రమం

నారావారిపల్లెలో పండుగ సందడి

● చంద్రబాబు,లోకేశ్‌లకు స్వాగతం పలికేందుకు భారీఎత్తున తరలివచ్చిన టీడీపీ శ్రేణులు ● పార్టీ అధినేతను కలిసిన పలువురు నాయకులు

చంద్రగిరి, జనవరి 14: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు కుటుంబం రాకతో ఆయన స్వగ్రామమైన నారావారిపల్లెలో సందడి నెలకొంది.ఏటా సంక్రాంతి పండుగను జరుపుకునేందుకు కుటుంబసభ్యులు,బంధువులతో కలిసి చంద్రబాబు స్వగ్రామానికి రావడం ఒక సంప్రదాయంగా పెట్టుకున్న విషయం తెలిసిందే.ఈసారి చంద్రబాబు తన కుమారుడు లోకేశ్‌తో కలిసి ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంటకు హెలికాప్టర్‌లో ఎ.రంగంపేటకు చేరుకున్నారు. అక్కడ టీడీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం కాన్వాయ్‌లో నారా వారిపల్లెలోని స్వగృహానికి 1.25 గంటలకు చంద్రబాబు,లోకేశ్ చేరుకున్నారు. మాజీ ఎంపీ నెలవల సుబ్రమణ్యం,మాజీ ఎమ్మెల్సీ దొరబాబు,మాజీ ఎమ్మెల్యేలు సుగుణమ్మ,షాజహాన్ బాషా,టీడీపీ నాయకులు నరసింహయాదవ్, గాలి భానుప్రకాష్,కొల్లారు ఇందుశేఖర్,హేమాం బరధర రావు, పులివర్తి సుధారెడ్డి, పులివర్తి వినీల్, గురజాల జగన్మోహన్, సుబ్రమణ్యం నాయుడు, రవినాయుడు, కోడూరు బాల సుబ్రమణ్యం,గౌస్‌బాషా, కుమారరాజా రెడ్డి, శివకోటేశ్వరరెడ్డి, గిరిధర్‌రెడ్డి తదితరులు చంద్రబాబు, లోకేష్‌లకు స్వాగతం పలికారు. చంద్రగిరి నియోజకవర్గంలో దొంగ ఓట్లు తొలగించాలంటూ నారావారిపల్లెలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నిరాహార దీక్ష చేస్తున్న రైతు దామోదరనాయుడిని చంద్రబాబు పలకరించారు.పార్టీ నాయకులను, కార్యకర్తలను ఆప్యాయంగా పలకరిస్తూ ఇంట్లోకి వెళ్లిన చంద్రబాబు, లోకేశ్ సాయంత్రం 4గంటలకు బయటకు వచ్చారు.సాయంత్రం6 గంటల దాకా ఇంట్లోని తన చాంబర్‌లో పార్టీ నాయకులను కలిసి ఫొటోలు దిగారు.మాజీ ఎమ్మెల్యేలు ఎస్సీవీ నాయుడు, మునిరామయ్య, టీడీపీ నేతలు మురళీమోహన్, చక్రాల ఉష, చిట్టిబాబు నాయుడు తదితరులు చంద్రబాబును కలిసిన వారిలో వున్నారు.రాత్రి ఇంట్లో బంధువులకు, గ్రామస్తులకు విందు ఏర్పాటు చేశారు. గ్రామస్తులను ఆప్యాయంగా పలకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.సంక్రాంతి పండుగ సందర్భంగా సోమవారం ఉదయం 9 గంటలకు కుటుంబ సభ్యులతో కలసి చంద్రబాబు, లోకేష్ గ్రామ దేవత దొడ్డి గంగమ్మకు, కుల దైవం నాగాలమ్మకు ప్రత్యేక పూజలు చేయనున్నారు. అనంతరం చంద్రబాబు తల్లితండ్రులైన ఖర్జూర నాయుడు, అమ్మణ్ణమ్మ సమాధులకు నివాళులర్పిస్తారు.తరువాత గ్రామంలోని ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిం చనున్నారు.మధ్యాహ్నం తరువాత చంద్రబాబు, లోకేశ్ తిరుగు ప్రయాణం కానున్నారు.



నారావారిపల్లెలో స్వాగతం పలుకుతున్న ప్రజలకు చంద్రబాబు అభివాదం - దీక్ష చేస్తున్న దామోదర నాయుడికి సంఘీభావం

నేటి ‘స్పందన’ రద్దు

చిత్తూరు, జనవరి 14: ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో జరుగుతున్న స్పందన కార్యక్రమాన్ని రద్దుచేసినట్లు డీఆర్వో రాజశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 15న సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ప్రభుత్వ సెలవు కారణంగా ఈ కార్యక్రమాన్ని రద్దుచేశామని పేర్కొన్నారు. ఈ విషయాన్ని గుర్తించి కలెక్టరేట్‌కు రావద్దని ప్రజలను కోరారు. జిల్లా పోలీసు కార్యాలయంలోనూ స్పందన కార్యక్రమాన్ని రద్దుచేసినట్లు ఎస్పీ రిషాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

17న చిత్తూరులో ఎన్నికల సమావేశం

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 14: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బుధవారం సాయంత్రం 5 గంటలకు కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో ఎన్నికల సమావేశం జరుగనుంది. రోల్ అబ్జర్వర్ పోలా భాస్కర్ ముఖ్యఅతిథిగా విచ్చేసే ఈ సమావేశానికి కలెక్టర్ షన్మోహన్ అధ్యక్షత వహించనున్నారు. ఈనెల 22న ప్రచురించనున్న తుది ఓటర్ల జాబితా అంశంపై రోల్ అబ్జర్వర్, ఈఆర్వో, ఏఈఆర్వో, ఎన్నికల అధికారులతో సమావేశం కానున్నారు.



పట్టుకో.. పట్టుకో..!

● మొండివెంగనపల్లెలో జల్లికట్టు

వెదురుకుప్పం, జనవరి 14: వెదురుకుప్పం మండలం మొండివెంగనపల్లెలో ఆదివారం జల్లికట్టు జరిగింది. ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి కోడెగిత్తలతో పాటు వీక్షించడానికి జనం ఆ గ్రామానికి తరలి వచ్చారు. జల్లికట్టు నిర్వహణకు గ్రామంలో అల్లిని ఏర్పాటు చేశారు. కోడె గిత్తల కొమ్ములను జివ్వి, రంగులు అద్ది, ఆ కొమ్ములకు బహుమతులుగా ఉపయోగించే పట్టీలను వివిధ దేవుళ్ల, రాజకీయ ప్రముఖులు, కోడెగిత్తల కుటుంబీకుల ఫొటోలతో కూడిన ఆకృతుల్లో కట్టారు. అల్లిలో సిద్ధంగా ఉన్న యువకుల వైపు గిత్తలను తరిమారు. వీటిని నిలువరించడానికి యువకులు ప్రయత్నించే క్రమంలో కొందరు గిత్తల కింద పడి గాయపడ్డారు. ఓ యువకుడు గిత్త కొమ్ములను పట్టుకుని, గిత్తపైనే ఎక్కి చాలా దూరం వెళ్లాడు. అల్లి నుంచి వెళ్లే క్రమంలో సమీపంలో కుంటలో గిత్తలు పడ్డాయి. పట్టీలను దక్కించుకునే క్రమంలో యువకుల మధ్య వాగ్వాదం, వాదోపవాదాలు జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన జనం మిద్దెలు, గోడలు ఎక్కి జల్లికట్టును చూశారు.



చంద్రబాబు, లోకేశ్, థామస్ ఫొటోలతో కట్టిన పట్టీ





పరుగెడుతున్న గిత్తలు - పట్టీ కోసం కుస్తీ





చిత్తూరు నగరం మాపాక్షి సమీపంలో..



జీడీ నెల్లూరు మండలం ఈదరపాళ్యం వద్ద..

మంచు సోయగం

దట్టమైన పొగమంచుతో గంగాధరనెల్లూరు మండలం ఆదివారం ఊటీని తలపించింది. శనివారం రాత్రి 8గంటల నుంచి చలి వాతావరణం ఉన్న.. ఆదివారం ఉదయం 9గంటలైన తీవ్రమైన పొగమంచుకారణంగా వాహనదారులు లైట్ల వెలుతురులో రాకపోకలు సాగించారు. చీకట్లను తరిమికొట్టాల్సిన సూరీడుసైతం మంచుతెరల మాటున ఉండిపోయారు. ప్రతిఇంటి ముందు తెల్లవారుజామున చిన్నారులు మొదలుకుని పెద్దలవరకు చలితీవ్రతకు అదురుతూ బోగిమంటలను వేసి పండుగ వేడుకలను ప్రారంభించారు.

- గంగాధరనెల్లూరు



కాణిపాకంలో గోదాదేవి కల్యాణం

ఐరాల(కాణిపాకం), జనవరి 14: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి అనుబంధ ఆలయమైన వరదరాజస్వామి ఆలయంలో ఆదివారం గోదాదేవి కల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఉదయం ప్రధాన ఆలయం నుంచి ఛైర్మన్ మోహన్‌రెడ్డి, ఈవో వెంకటేశు ఆలయం నుంచి పట్టు వస్త్రాలను తీసుకొచ్చి అర్చకులకు అందించారు. ఆలయ ప్రాంగణంలో అర్చక, పండితులు శాస్త్రోక్తంగా హోమాలు నిర్వహించారు. అనంతరం వేదమంత్రాల నడుమ గోదాదేవి కల్యాణాన్ని నిర్వహించారు, చిన్నారులకు భోగి పళ్లతో స్నానం చేయించారు. కల్యాణానికి విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం గోదాదేవి ఉత్సవమూర్తిని వాహనంపై ఉంచి భాజాభజంత్రీలు వాయిస్తూ కాణిపాకం పుర వీధులలో ఊరేగించారు. ఈ కార్యక్రమానికి కాణిపాకానికి చెందిన ధనంజయయాదవ్ ఉభయదారులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు రమేష్, గిరి తదితరులు పాల్గొన్నారు.

← గోదాదేవి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

సింగిరిగుంటలో పొట్టేలు చోరీ

● నిందితుడిని పోలీసులకు అప్పజెప్పిన రైతులు

చౌడేపల్లె, జనవరి14: మండలంలోని సింగిరిగుంటలో శనివారం రాత్రి పొట్టేలు చోరీ జరిగింది. బాధితుల కథనం మేరకు... సింగిరిగుంటకు చెందిన జంపాల శ్రీనివాసులునాయుడు పొట్టేలును పెంచుకుంటున్నాడు. శనివారం రాత్రి ఇంటి అవరణలో కట్టేసిన పొట్టేలు కనిపించకపోయే సరికి శ్రీనివాసులు అన్న సుబ్రహ్మణ్యం నాయుడు అర్ధరాత్రి వేళ గుర్తించి తన తమ్ముడిని నిద్రలేపి చెప్పాడు. పొట్టేలు చోరీ అయిందని గుర్తించి వెంటనే పీలేరు సంతకు కారులో బయలుదేరి వెళ్లారు. వేకువ జాము 2.45గంటల నుంచి ఉదయం వరకు పీలేరు సంతలో వెతికారు. చివరకు 6 గంటలకు ఓ యువకుడు రెండు పొట్టేళ్లతో ఓ అద్దె కారులో వచ్చాడు. వెంటనే అతడి వద్దకు పోయి ఇది మా పొట్టేలు, నీ వద్దకు ఎలా వచ్చిందని అడిగారు. అతను తడబడుతూ బుకాయించడానికి ప్రయత్నం చేశాడు. వెంటనే అతన్ని కారులో తీసుకుని శ్రీనివాసులు నాయుడు తన పొట్టేలుతోపాటు, చోరీ చేసి తెచ్చిన మరో పొట్టేలును ఆటోలో సింగిరిగుంటకు తీసుకు వచ్చారు. వలసపల్లెకు చెందిన మరో రైతు పొట్టేలు చోరీ చేసినట్లు గుర్తించి ఆ రైతుకు సమాచారం అందించడంతో ఆ రైతు వచ్చి తన పొట్టేలును తీసుకువెళ్లాడు. చోరీకి పాల్పడ్డ యువకుడు సదుం మండలానికి చెందిన రాజేష్‌గా గుర్తించి పోలీసులకు అప్పగించారు. రాజేష్‌తోపాటు మరో ముగ్గురు కలసి తరచూ అద్దె కారు తీసుకుని రాత్రిల్లో గొర్రెలు, పొట్టేళ్ల చోరీలు చేసి సంతల్లో అమ్ముకుంటూ టారని రైతులు అంటున్నారు.

వైసీపీ ప్రభుత్వం రూ.600 కోట్లు దారి మళ్లించింది

వెంటనే ఆ నిధులను స్థానిక సంస్థల ఖాతాల్లో జమచేయాలి

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 14: స్థానిక సంస్థలకు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధుల్లో వైసీపీ ప్రభుత్వం వాడుకునేందుకు వేచిచూస్తున్న రూ.600 కోట్లను గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్‌ల ఖాతాల్లో జమచేయాలని జిల్లా పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షుడు చుక్కా ధనుంజయ యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన స్థానికంగా విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలోని 12,918 గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం ద్వారా 2022-23 ఆర్థిక సంవత్సరానికి రెండో విడతగా రూ.988 కోట్లు నిధులు విడుదల చేసిందని, అందులో రూ.393 కోట్లు గ్రామ పంచాయతీలకు జమచేసి, మిగిలిన రూ.600 కోట్లు వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించిందని ఆరోపించారు. గ్రామ పంచాయతీలకు రావాల్సిన నిధులు దారి మళ్లింపునకు నిరసనగా సంఘం ఆధ్వర్యంలో కార్యాచరణ చేపట్టేందుకు సిద్ధమవుతున్నామని పేర్కొన్నారు. పంచాయతీలకు నిధులు కేటాయించకుంటే పోరాటానికి సిద్ధమవుతామని చెప్పారు. రెండ్రోజుల క్రితం ఉమ్మడి జిల్లాకు విడుదల చేసిన రూ.2279 కోట్లలో ఒక్క పైసా కూడా ఇంతవరకు గ్రామ పంచాయతీల ఖాతాలకు వేయలేదని, త్వరలో ప్రభుత్వం ఈ మొత్తాన్ని విద్యుత్ బిల్లుల బకాయిలకు బదలాయించే సూచనలు కన్పిస్తున్నాయన్నారు. ఇదే జరిగితే కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించే కార్యక్రమాన్ని చేపడతామని ఆయన హెచ్చరించారు.

నిత్యావసర వస్తువుల పంపిణీలో 15వ స్థానంలో చిత్తూరు

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 14: నిత్యావసర వస్తువుల పంపిణీలో ఆదివారం నాటికి చిత్తూరు రాష్ట్రస్థాయిలో 15వ స్థానంలో నిలిచింది. 5,41,703 కార్డులకు గాను ఇంతవరకు 4,58,240 కార్డులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేసి 84.59 శాతం సాధించింది. పోర్టబిలిటీ ద్వారా 78,415 మందికి ఎండీయూ వాహనాల ద్వారా నిత్యావసర వస్తువుల పంపిణీ కొనసాగింది.

భోగి మంటల్లో ఎస్మా నోటీసులు దహనం





నోటీసులను భోగి మంటల్లో తగలబెడుతున్న అంగన్వాడీలు - బైరెడ్డిపల్లెలో భోగిమంటలు వేసి నిరసన

శాంతిపురం, జనవరి 14 : అంగన్వాడీ వర్కర్లు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. ఆదివారం సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీలు ప్రభుత్వం అందించిన నోటీసులను సమ్మె వద్ద భోగి మంటలు వేసి అందులో తగలబెట్టారు. ప్రభుత్వానికి ఆడబిడ్డల ఉసురు తగలకుండా పోదని ఆవేదన చెందారు. ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులకు గురి చేసినా సమ్మె మాత్రం విరమించే ప్రసక్తే లేదన్నారు. అక్కడే ముగ్గులు వేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలుచేశారు.కార్యక్రమంలో రామకుప్పం, శాంతిపురం మండలాల అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లె: తమ అపరిష్కృత సమస్యల పరిష్కారానికై అంగన్‌వాడీలు చేస్తున్న ఆందోళన భోగి రోజు కూడా కొనసాగింది. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్వాడీ కార్యకర్తలు భోగి మంటలు వేసి తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలిపారు. ప్రభుత్వం మొండివైఖరి విడనాడి తమ సమస్యలపై సానుకూలంగా స్పందించాలని వారు కోరారు.

అంతర్రాష్ట్ర ద్విచక్ర వాహన దొంగల అరెస్టు



పోలీసులు రికవరీ చేసిన ద్విచక్ర వాహనాలు

వి.కోట, జనవరి 14: ఆంధ్రా, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో ద్విచక్ర వాహనాలను దొంగలించి విక్రయించే ముఠాను వి.కోట పోలీసులు పట్టుకున్నారు. డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, వి.కోట సీఐ లింగప్ప వివరాల మేరకు... కర్ణాటక రాష్ట్రం, కేసంబళ సమీపంలోని చిన్నకొత్తూరుకు చెందిన కుమార్, వి.కోట మండలం బంగ్లాటిరుకు చెందిన పవన్‌కుమార్ చెడు వ్యసనాలకు బానిసలై మూడు రాష్ట్రాల్లో ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడేవారు. ఆదివారం కేజీఎస్ రోడ్డు వద్ద వాహనాలను సోదా చేస్తున్న పోలీసులకు నంబరు లేకుండా వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని ఆపి విచారించగా చోరీల విషయం వెలుగు చూసింది. కుమార్, పవన్‌లను అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారించగా మూడు రాష్ట్రాల్లో దాదాపు 22 ద్విచక్ర వాహనాలు చోరీ చేసి వి.కోటకు చెందిన సుబ్రమణ్యం, సలీం అనే వారికి విక్రయించినట్లు వివరించారు. ఈ మేరకు పోలీసులు 9 స్ప్లెండర్ ద్విచక్ర వాహనాలు, 5 ఫ్యాషన్ ప్రో, రెండు హోండా యాక్టివా, హోండా డియో, బజాజ్ డిస్కవర్, హోండా షైన్, టీవీఎస్ ఎక్స్ఎల్ ఒక్కొక్కటి చొప్పున రికవరీ చేసినట్లు పోలీసులు వివరించారు. వీటి విలువ రూ. 20 లక్షలు ఉంటుందని, ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండుకు పంపుతున్నట్లు తెలిపారు. వీరితోపాటు ద్విచక్ర వాహనాలు కొనుగోలు చేసిన సుబ్రమణ్యం, సలీంలను నిందితులుగా చేశామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

తెలంగాణరోడ్డు ప్రమాదంలో పెనుమూరు మహిళ మృతి



సూరపనేని మాలతి (ఫైల్‌ఫొటో)

పెనుమూరు, జనవరి 14: తెలంగాణలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పెనుమూరు మండలం గుత్తావాండ్లవూరు గ్రామానికి చెందిన శ్రీనివాస్ భార్య సూరపనేని మాలతి (42) మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రైస్ రీసెర్చ్ సెంటర్ (కేంద్ర వరి పరిశోధనా కేంద్రం)లో రీసెర్చ్ అసోసియేట్‌గా మాలతి పనిచేస్తున్నారు. సంక్రాంతికి భర్త సొంత గ్రామానికి నాలుగు రోజుల ముందే వచ్చారు. మాలతి శుక్రవారం రాత్రి 10.15 గంటలకి జగన్ ట్రావెల్స్‌లో చిత్తూరుకి బయలుదేరారు. శనివారం ఉదయం 7.30కి చిత్తూరుకి రావల్సిఉండగా, అర్ధరాత్రి తెలంగాణ రాష్ట్రం గద్వాల్ జిల్లా ఇటిక్యాల మండలం ఎర్రవల్లి సమీపంలో బస్సు అదుపుతప్పి పల్టీకొట్టింది. దీంతో అక్కడున్న ఇటిక్యాల పోలీసులు, స్థానికంగా పనిచేస్తున్న పంజాబ్‌కు చెందిన కూలీలు బస్సు అద్దాలు పగలకొట్టి అందులో ప్రయాణిస్తున్న వారిని రక్షించారు. మొత్తం 30 మందిలో 5 మంది గాయాలతో బయటపడ్డారు. అయితే మాలతి చెయ్యి సపోర్టుకు అమర్చిన ఇనుప రాడ్డు మధ్యలో ఇరుక్కుపోగా ఆమె బయటపడలేక పోయారు. ఆ ఇనుప రాడ్డును కట్ చేసేందుకు పోలీసులు, స్థానికులు బలంగా ప్రయత్నించారు. కటర్‌ను కూడా తీసుకువచ్చి ప్రయత్నించేలోపు బస్సులో మంటలు చెలరేగాయి. కళ్ల ముందే మాలతి సజీవదహనం అవ్వడంతో చూపరుల కళ్లు చెమ్మగిల్లాయి. ఆదివారం కుటుంబ సభ్యులు మాలతి మృతదేహానికి దహనక్రియలు పూర్తి చేశారు. పండుగ రోజు స్వగ్రామం గుత్తావాండ్లవూరులో తీవ్ర విషాదచాయలు అలుముకున్నాయి.









ఇళ్ల ముందు భోగి మంటలు వేస్తున్న యువకులు- సదుంలో వెలసిన పశు అలంకరణ సామాగ్రి దుకాణాలు - సోమలలో భోగి మంటలు - రొంపిచెర్లలో భోగి మంటలు

ఘనంగా భోగి సంబరాలు

కుప్పం, జనవరి 14 : కుప్పంలో ఆదివారం జనం భోగి సంబరాలు జరుపుకొన్నారు. తెల్లవారుజామునే ఇళ్ల ముందర భోగిమంటలు వేశారు. మహిళలు రంగవల్లులు తీర్చిదిద్ది, పసుపు-కుంకుమలు దిద్దారు. భోగి పండుగను పురస్కరించుకుని ప్రతిఇల్లూ బంధుమిత్రులతో, పిల్లాపాపలతో కళకళలాడింది.

పుంగనూరు రూరల్: పుంగనూరు పట్టణ, మండల పరిధిలో ఇళ్లలోని పాత వస్తువులు, కట్టెలు, గొబ్బెమ్మ పిడకలు, పాత పుస్తకాలు ఇళ్ల ముందు వేసి కుటుంబసభ్యులతో కలసిభోగిమంటలు వేశారు. బంధువులు, కుటుంబీకులు, స్నేహితులకు భోగి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

సదుం: భోగి పండుగ సంబరాలను మండల ప్రజలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు.గ్రామాలన్నీ బంధుమిత్రులతో కళకళలాడాయి.

కల్లూరు: మండలంలోని పాతపేటలో ప్రజలంతా వీధిలోని ఒకే చోటకు చేరుకొని భోగి మంటలు వేశారు.

బైరెడ్డిపల్లె: పట్టణంలోని వీధుల్లో బాలికలు, మహిళలు గొబ్బెమ్మపాటలు పాడుకుంటూ సందడి చేశారు. ఇళ్లలో అనపకాయలు ఉడకబెట్టి తిన్నారు. పండుగ సరుకులు కొనుగోలు చేయడానికి వచ్చిన జనంతో దుకాణాల వద్ద రద్దీ ఏర్పడింది.









పాతపేటలో భోగి మంటలు వేస్తున్న ప్రజలు - రామకుప్పంలో భోగి మంటలు వేసిన యువకులు - పీఎంకేతాండాలో భోగి మంటలు వేసిన మహిళలు - బైరెడ్డిపల్లెలోని ఓ వీధిలో భోగి మంటలు వేస్తున్న చిన్నారులు

త్రైతసిద్ధాంత భగవద్గీత ప్రచారం

శాంతిపురం, జనవరి 14 : శాంతిపురం మండలం సి.బండపల్లెలో ఆదివారం త్రైతసిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూజ్ఞాన వేదిక శివరామపురం కమిటీ సభ్యులు భగవద్గీత ప్రచారం చేశారు. క్రాంతి అంటే తిరుగుబాటు అని, సంక్రాంతి అంటే మనిషి లోని దుర్గుణాలపై తిరుగుబాటు అని, సుఖ, భోగి వాంఛలను అగ్నికి ఆహుతి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో కుప్పం కమిటీ సభ్యులు కృష్ణనాగరాజు, కృష్ణన్న, చరణ్, వెంకటలక్ష్మి, దేవరాజులు, పూజ పాల్గొన్నారు.

'గురజాల'కు పలువురి శుభాకాంక్షలు

చిత్తూరు రూరల్, జనవరి 14: జీజేఎం ట్రస్టు ఛైర్మన్, టీడీపీ సీనియర్ నేత గురజాల జగన్మోహన్ పుట్టిన రోజు వేడుకలు ఆదివారం రాత్రి చిత్తూరులోని ఆర్‌ఎల్‌ఎన్ కన్వెన్షన్ హాలులో నిర్వహించారు. టీడీపీ, జనసేన నాయకులు, ప్రజలు తరలివచ్చి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. బిగ్‌బాస్ ఫేమ్ గీతు రాయల్, సీనియర్ ఎన్టీఆర్, బాలకృష్ణ డూప్‌లతో సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు చంద్రప్రకాష్, మాజీ మేయర్ హేమలత, జీడీ నెల్లూరు ఇన్‌చార్జ్ థామస్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమినేని చిట్టిబాబు, నేతలు కాజూరు బాలాజీ, మహదేవ సందీప్, వసంత్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. అర్ధరాత్రి 12 గంటలకు కేకు కట్ చేశారు.



గురజాలకు శుభాకాంక్షలు తెలుపుతున్న దొరబాబు, చంద్రప్రకాష్, హేమలత తదితరులు

రూ.82వేల విలువ చేసే కర్ణాటక మద్యం పట్టివేత

● ఒకరి అరెస్టు, మరొకరు పరార్



నిందితుడు, మద్యాన్ని మీడియాకు చూపిస్తున్న డీఎస్పీ

గుడిపాల, జనవరి 14: అక్రమ మద్యం కలిగి ఉన్న ఓ వ్యక్తిని గుడిపాల పోలీసులు పట్టుకోగా, మరొకరు పరార్ అయ్యాడు. అతడి వద్ద నుంచి రూ.82వేల విలువ చేసే కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను సీఐ రవిశంకర్, ఎస్ఐ రామ్మోహన్‌లతో కలిసి డీఎస్పీ శ్రీనివాసమూర్తి ఆదివారం మీడియాకు వివరించారు. గత కొంతకాలంగా అక్రమ మద్యంపై పోలీసులు గట్టి నిఘా ఉంచారు. ఈ నేపథ్యంలో పోలీసులకు అందిన సమాచారం మేరకు శనివారం రాత్రి మండలంలోని పిళ్లారికుప్పం వద్ద రమేష్‌రెడ్డి(46), అతడి స్నేహితుడు హరి(40) పిళ్లారికుప్పంలోని ముళ్లపొదల్లో కర్ణాటక మద్యాన్ని విక్రయిస్తున్నట్లు తెలిసింది. దాంతో పోలీసులు దాడులు చేయగా రమేష్ పట్టుబడగా, హరి పరారయ్యాడు. పట్టుకున్న వ్యక్తి నుంచి రూ.82వేల విలువ చేసే 960 టెట్రాప్యాకెట్లను స్వాధీనం చేసుకుని నిందితుడ్ని రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న హరి కోసం వెతుకుతున్నారు. కాగా ఈ కేసును ఛేదించడానికి కృషి చేసిన పోలీసులను డీఎస్పీ అభినందించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.78 కోట్లు

తిరుమల, జనవరి14(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.78 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం లెక్కించి ఆదివారం ఉదయం ప్రకటించింది. ఇక, శనివారం 65,962 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 24,575 మంది తలనీలాలు సమర్పించారు.

16న తిరుపతి నుంచి అజ్మీర్‌కు ప్రత్యేక రైలు

రేణిగుంట, జనవరి14: రాజస్థాన్‌లోని అజ్మీర్‌లో జరుగుతున్న ఉరుసు ఉత్సవానికి ముస్లిం భక్తుల కోసం 16న ప్రత్యేక రైలు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌ఓ సీహెచ్ రాకేష్ తెలిపారు. తిరుపతి నుంచి ఈ ప్రత్యేక రైలు(07227) మంగళవారం ఉదయం 8.10 గంటలకు బయలు దేరుతుందని వివరించారు. మళ్లీ అజ్మీర్‌లో ఈ రైలు(07228) ఈ నెల 21 తేదీ రాత్రి 11.20 గంటలకు తిరుపతికి బయలుదేరుతుందని వివరించారు.

చంద్రగిరిలో కొత్త ఓట్లు ఎక్కువేమీ లేవు

ఏడాదిలో చేర్చింది 25వేల ఓట్లే

ఫిర్యాదులన్నీ పరిష్కరించాం - తిరుపతి ఆర్డీవో నిషాంత్ రెడ్డి

తిరుపతి, జనవరి 14 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా పెరిగిన జనాభా నిష్పత్తి మేరకే చంద్రగిరి నియోజకవర్గంలో కొత్త ఓటర్లు నమోదయ్యారని, అంతేగాని దొంగ ఓట్లు ఉన్నాయన్న వార్తల్లో నిజం లేదని ఆర్డీవో నిషాంత్ రెడ్డి తెలిపారు. ఆదివారం తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ చంద్రగిరి నియోజకవర్గంలో 2019లో 2,91,000 ఓట్లు ఉంటే ప్రస్తుతం 3,08,000 ఓట్లు మాత్రమే ఉన్నాయన్నారు. అంటే గడిచిన ఐదేళ్లలో 17వేల ఓట్లు మాత్రమే పెరిగాయని చెప్పారు. తిరుపతి నగరాన్ని కేంద్రంగా చేసుకుని ఇతర ప్రాంతాల నుంచి తిరుపతి రూరల్ పరిధిలోనే ఎక్కువగా పెరిగాయన్నారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో చంద్రగిరి కంటే 20 నియోజకవర్గాల్లో ఓటర్ల సంఖ్య పెరిగిందన్నారు. వైజాగ్, విజయవాడ, గుంటూరు నగర పరీవాహక నియోజకవర్గాల్లో ఓటర్లు గణనీయంగా పెరుగుతున్నారని చెప్పారు. వీటి తర్వాత స్థానంలో తిరుపతి నగరం ఉందన్నారు. కర్నూలు సమీపంలోని పాణ్యం నియోజకవర్గంలో 34వేలు ఓట్లు పెరిగాయన్నారు. చంద్రగిరిలో గత ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు కొత్త ఓట్లు 25వేలు మాత్రమేనని, 18వేలు తొలగించామని, 1,600 డూప్లికేట్ ఓట్లు, ఒకే చిరునామాతో 230 ఉన్నాయని గుర్తించి విచారణ చేసి తీసేశామని అన్నారు. ఒకే ఇంట్లో పదిమందికన్నా ఎక్కువ ఉన్నవి 3,600 ఓట్లు గుర్తించి తొలగించామన్నారు. డిసెంబరు 9నాటికి వచ్చిన ఫిర్యాదులన్నింటికీ పరిష్కరించామన్నారు. నియోజకవర్గంలో 395 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని, 2021లో 388 పోలింగ్ స్టేషన్లు ఉంటే కొత్తగా 7 కలిశాయన్నారు. గడిచిన ఐదేళ్లలో నియోజకవర్గంలో 30వేలు కొత్త గృహ విద్యుత్ కనెక్షన్లు వచ్చాయని, 7వేల హౌస్ నెంబర్లు వచ్చాయన్నారు. వీటిని పరిశీలిస్తే జనాభా పెరుగుదల స్పష్టంగా కనిపిస్తోందన్నారు.

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ

శ్రీకాళహస్తి జనవరి 14: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. రెండవ శనివారం సంక్రాంతి సెలవులు వరుసగా కలిసి రావడంతో ఆదివారం రద్దీ పెరిగింది. వేకువ జాము నుంచే క్యూ లైన్‌లో భక్తులు బారులు తీరారు. సుమారు 25వేల మంది దర్శించుకున్నట్లు అధికారులు అంచనా వేశారు.

కోడి పుంజులు స్వాధీనం

ఏర్పేడు, జనవరి 14: ఏర్పేడు మండలంలో పెనుమల్లం వద్ద నిర్వహిస్తున్న కోడిపందేలపై ఏర్పేడు సీఐ శ్రీహరి, ఎస్ఐ జిలానీ, ఏఎస్ఐ జగన్‌మోహన్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు చేపట్టారు. మనోహర్, మహేష్, మల్లికార్జున్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారినుంచి ఓద్విచక్ర వాహనం, రెండుసెల్‌ఫోన్లు, రెండు కోళ్లు, రూ.13,780 నగదు స్వాధీనం చేసుకున్నారు. ● మున్నసముద్రం గ్రామంలో జరుగుతున్న కోడిపందేలపై దాడి చేసి వెంకటరెడ్డి, మునస్వామిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రెండు కోళ్లు, రూ.1,100 నగదు స్వాధీనం చేసుకున్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

గంగవరం : కల్లుపల్లె ఉన్నత పాఠశాలలోని 8వ తరగతి విద్యార్థులకు ఆదివారం ప్రభుత్వం ఇచ్చిన ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్ ప్రహ్లాద, హెచ్ఎం రాముడు, పాఠశాల కమిటీ ఛైర్మన్ గంగాధర్, రమణారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు రాజా, అన్వర్‌బాషా పాల్గొన్నారు.

మకరజ్యోతి దర్శనానికి ఏర్పాట్లు పూర్తి

సదుం : ఎర్రాతివారిపల్లె అయ్యప్పస్వామి ఆలయంలో మకరజ్యోతి దర్శనం ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళవారం సాయంత్రం మకరజ్యోతి వీక్షణకు వచ్చే భక్తులకు ప్రత్యేక బస్సులు, వాహనాల పార్కింగ్, పోలీసు బందోబస్తు, ప్రత్యేక క్యూలైన్ల తదితర ఏర్పాట్లను మంత్రి కుటుంబ సభ్యులు స్వయంగా పర్యవేక్షించారు.

రాష్ట్రానికి పట్టిన కీడు తొలగాలి.. ఏపీ వెలగాలి

భోగి సంకల్పం రాసిన ప్రతులను మంటల్లో తగులబెట్టిన టీడీపీ శ్రేణులు



కుప్పంలో భోగి మంటలు వేస్తున్న పీఎస్.మునిరత్నం తదితరులు, కుప్పం మండలం మల్లానూరులో ప్రేమ్‌కుమార్ తదితరులు, రామకుప్పంలో జీఓలను దహనం చేస్తున్న టీడీపీ శ్రేణులు

కుప్పం/కుప్పం రూరల్, జనవరి 14: కుప్పంలో టీడీపీ శ్రేణులు ఆదివారం జనంతో కలిసి ఘనంగా భోగి వేడుకలు నిర్వహించాయి. పట్టణాలు, గ్రామాలు అనే తేడా లేకుండా జనంతో కలిసి భోగిమంటలు వేసి సంబరాలు జరుపుకున్నాయి. జగన్‌రెడ్డి రూపంలో రాష్ట్రానికి పట్టిన కీడు తొలగాలి, ఏపీ వెలగాలి' అని సంకల్పం చెప్పుకున్నాయి. కుప్పం పట్టణంతోపాటు కుప్పం మండలం మల్లానూరు గ్రామం, ఇతర పంచాయతీలన్నింటిలో ఎక్కడికక్కడ భోగిమంటలు వేసి భోగి సంకల్పం రాసిన ప్రతులను టీడీపీ శ్రేణులు మంటల్లో తగులబెట్టాయి. ఈ సందర్భంగా టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్.మునిరత్నం, కుప్పం మున్సిపల్, రూరల్ మండల అధ్యక్షులు రాజ్‌కుమార్, ప్రేమ్‌కుమార్‌లు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. రాష్ట్రానికి జగన్‌రెడ్డి పీడలా దాపురించారని, ఈ భోగి మంటలతో ఆ పీడ తొలగిపోవాలని ఆకాంక్షించారు. త్వరలోనే జరుతనున్న ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించి, చంద్రబాబు ముఖ్యమంత్రి అవుతాడని దాంతో ఏపీ వెలిగిపోతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆయా పంచాతీలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ చీకటి పాలనకు చరమగీతం

రామకుప్పం : వైసీపీ చీకటి పాలనకు చరమగీతం పాడేందుకు రాష్ట్ర ప్రజలంతా వేచి చూస్తున్నారని ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, పార్టీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ అధ్యక్షుడు ఆంజినేయరెడ్డిలు తెలిపారు. ఆదివారం రామకుప్పం టీడీపీ కార్యాలయం ఎదుట టీడీపీ శ్రేణులు వైసీపీ ప్రభుత్వ చీకటి జీఓల ప్రతులను భోగి మంటల్లో దహనం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు విశ్వనాథ్, వెంకటాచలం, నేతలు సీతాపతి, రామ్మూర్తి, గంట్లప్పగౌడు, కృష్ణానాయక్, సలాంసాబ్, కొళ్ళపల్లెబాబు, రామకృష్ణప్ప, జయశంకర్, ఆదిల్, గజేంద్ర, పద్మనాభరెడ్డి, నందారెడ్డి, సుబ్రీ, బాలరాజు, మంజునాథ్, నాగభూషణం, విజయ్‌కుమార్‌రెడ్డి, టీవీరవి, చిన్నసురేష్, వేలు, మనోహర్, పెరుమాళ్, శంకర్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.



శాంతిపురంలో జీవోలను భోగి మంటల్లో వేస్తున్న నేతలు

శాంతిపురం, : ప్రజా వ్యతిరేక పరిపాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు అన్నారు. ఆదివారం భోగి పండగను పురస్కరించుకుని శాంతిపురం ఎన్టీఆర్ విగ్రహం కూడలిలో వైసీపీ ప్రభుత్వం తెచ్చిన ప్రజా వ్యతిరేక జీవోలను భోగి మంటల్లో వేసి తగలబెట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధికారం చేపట్టిన రెండో రోజుకే కూల్చడంతో పరిపాలన సాగించిన జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం రెండు నెలల్లో కూలిపోవడం ఖాయమన్నారు. సీఎం నుంచి వైసీపీ కార్యకర్త వరకు అరాచకాలు, దాడులు, అక్రమాలు, దోపిడీలు, కేసులతో ప్రతిపక్షాలను ప్రజలను భయపెట్టి లొంగదీసుకోవాలని చూశారన్నారు. అయితే ప్రజలు ఎన్నికల్లో కోసం ఎదురు చూస్తున్నారన్నారు. ప్రతి కార్యకర్త రెండు నెలలపాటు సమష్టిగా కష్టపడి పని చేయాలని సూచించారు. ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కరించేందుకు నేతలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు విజయరామిరెడ్డి, ఆర్ఎస్ మణి, చంద్రశేఖర్, ఏఎంసీ నాగరాజు, రమేష్, నారాయణరెడ్డి, నాగరాజు, శివశంకర్, ఉయ్యాల జయరామిరెడ్డి, రుద్రప్ప, ఎల్.జయరామిరెడ్డి, గోవిందరాజులు, బాలకృష్ణ, నాగభూషణంరెడ్డి, భాస్కర్, ఉమాపతి, సుగుణమ్మ, శేఖర్, బాలు, పురుషోత్తం, ఆనందరెడ్డి, జయరాం తదితరులు పాల్గొన్నారు.

కేపీఎల్ విజేతగా పీసీబీ జట్టు



చౌడేపల్లె, జనవరి14: కేపీఎల్ క్రికెట్ పోటీలలో పీసీబీ జట్టు విజేతగా నిలిచింది. ఆదివారం దాదేపల్లె సమీపంలో ఉన్న నారాయణరాజు మెమోరియల్ స్టేడియంలో జరిగిన పోటీలలో పీసీబీ జట్టు ప్రథమ స్థానం, పాపిశెట్టిపల్లెకు చెందిన పీఎస్ హాక్స్ ద్వితీయస్థానం, కేవీపీ కింగ్స్ మూడవ స్థానంలో నిలిచాయి. మొదటి బహుమతిగా రూ.లక్ష, రెండవ బహుమతి రూ.75వేలు, మూడవ బహుమతి రూ.50వేలను నిర్వహకులు విజేతలకు అందించారు. కార్యక్రమంలో కేపీఎల్ నిర్వహకులు భాస్కర్‌రాజు, శ్రీనివాస్‌రాజు, పురుషోత్తమరాజు, అనిల్‌రాజు, శివశంకర్‌రాజు, సుబ్రహ్మణ్యరాజు, శ్యామ్‌రాజు, శ్రీదర్‌రాజు, వెంకటేష్‌రాజు, నారాయణరాజు, లీలాకుమార్ పాల్గొన్నారు.

క్రీడల్లో యువతను ప్రోత్సహించాలి



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న విశ్రాంత డీఎస్పీ

పుంగనూరు, జనవరి14: గ్రామీణ ప్రాంతాల్లో యువతను క్రీడల్లో ప్రోత్సహించడానికి వాల్మీకి మహర్షి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు వాల్మీకి సంఘ నేత, విశ్రాంత డీఎస్పీ కె.సుకుమార్ తెలిపారు. ఆదివారం చౌడేపల్లె మండలం కాగతి గ్రామసమీపంలో ఆదివారం క్రికెట్ పోటీలను ప్రారంభిస్తూ పోటీలు ఈనెల 18వరకు జరుగుతాయని తెలిపారు. ఎంట్రీ ఫీజు రూ. 500 చెల్లించాల్సివుందన్నారు. ఆదివారం నాటికి 25 క్రికెట్ టీములు వచ్చాయని, ఈపోటీల్లో విజేతలకు మొదటి బహుమతి రూ. 20,000, ద్వితీయ బహుమతి రూ.15,000, తృతీయ బహుమతి రూ.10,000 అందివ్వనున్నట్లు చెప్పారు. ప్రతి మ్యాచ్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ వుంటుందని, క్రీడాకారులు స్నేహపూరిత పోటీతో ముందుకు వెళ్లాలని సూచించారు. ఇతర వివరాల కోసం సెల్:9581242714, 9347376563, 6303269365, 8676525284 ఫోన్ నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘ నాయకులు పాల్గొన్నారు.

నాటుసారా స్థావరాలపై దాడులు

పుంగనూరు రూరల్, జనవరి 14: మండల పరిధిలోని తాండాల్లో ఆదివారం సీఐ రాఘవరెడ్డి ఆధ్వర్యంలో నాటుసారా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించి బట్టీలను ధ్వంసం చేశారు. సుగాలిమిట్ట తాండా, జువ్వలదిన్నె తాండా సమీపాల్లో బట్టీలు నాశనం చేశారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ సారా తయారీ, అమ్మకాలు, రవాణా, నిల్వ ఉంచుకోవడం నేరమని, సారాకు దూరంగా ఉండాలని అవగాహన కల్పించారు.

యూటీఎఫ్ నాయకుల నిరసన



పుంగనూరు రూరల్, జనవరి 14: ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల పట్ల తెచ్చిన ప్రభుత్వ జీవో ప్రతులను ఆదివారం పుంగనూరులో యూటీఎఫ్ జిల్లా నాయకులు వెంకటేశ్వరరెడ్డి, శంకర్‌రెడ్డిలు భోగి మంటల్లో దహనం చేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు అందాల్సిన ప్రయోజనాల నిధులు, తాము దాచుకున్న డబ్బులను వెంటనే ప్రభుత్వం మంజూరు చేయాలని నిరసన తెలియజేస్తున్నట్లు తెలిపారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు



చౌడేపల్లె, జనవరి14:స్థానిక చిట్రెడ్డిపల్లెలో వెలసిన బోయ కొండ గంగమ్మకు గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం వేదపండితులు అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం గ్రామస్తులు అమ్మవారికి జంతుబలులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

23న టీడీపీ జయహో బీసీ సభ

రామకుప్పం, జనవరి 14: ఈనెల 23న రామకుప్పంలో జయహో బీసీ సభ నిర్వహిస్తున్నట్లు ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పట్రనారాయణాచారి, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, పార్టీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ అధ్యక్షుడు ఆంజినేయరెడ్డి తెలిపారు. ఆదివారం రామకుప్పం పార్టీ కార్యాలయలంలో పార్టీ బీసీ నేతల సమావేశంలో వారు మాట్లాడుతూ జయహో బీసీ సభ విజయవంతానికి నేతలు, కార్యకర్తలు కృషి చేయాలని వారు కోరారు. ఈ సమావేశంలో పార్టీ బీసీ నేతలు నాగభూషణం, గంట్లప్పగౌడు, మనోహర్, విశ్వనాథ్, వెంకటాచలం, వేలు, చిన్నసురేష్, గజేంద్ర పాల్గొన్నారు.

కందూరులో 'వికసిత్ భారత్'

సోమల, జనవరి 14: కందూరు పంచాయతీలో ఆదివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఎంపీడీవో నాగరాజ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే ప్రభుత్వ వైద్యశాలల్లో పీఎంవీవై, ఆరోగ్యశ్రీ పథకాల అమలు గురించి వైద్యాధికారి విజయలక్ష్మి వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈశ్వరయ్య, సర్పంచు బాషా మసూద్, కార్యదర్శి జయశంకర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



కుప్పం, జనవరి 14: కుప్పం మాజీ ఎమ్మెల్యే దొరస్వామినాయుడు 24వ వర్ధంతిని ఆయన కుమారుడు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండు కూడలిలో దొరస్వామినాయుడు చిత్రపటాన్నుంచి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే బీఆర్‌డీకి ఘన నివాళి



రామకుప్పం, జనవరి 14: కుప్పం మాజీ ఎమ్మెల్యే దివంగత బీఆర్ దొరస్వామి నాయుడు వర్ధంతిని ఆదివారం రామకుప్పంలో టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. టీడీపీ కార్యాలయంలో బీఆర్‌డీ చిత్రపటానికి నేతలు పూజలు చేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాలలో ఐఆర్ఎం విజయభేరి



కుప్పం, జనవరి 14: ఎస్వీయూ డిగ్రీ రెండవ సెమిస్టర్ పరీక్షల్లో కుప్పంలోని ఐఆర్ఎం కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు కళాశాల ఛైర్మన్ బీఎం.దయానిధి తెలిపారు. బీకామ్ సీఏ విభాగంలో ఎస్.మనీష 9.51 పాయింట్లు, బీఎస్సీలో కె.త్రిష 9.09, బీబీఏలో ఎస్.హీనా కౌసర్ 8.13 పాయింట్లు సాధించినట్లు పేర్కొన్నారు. అలాగే ఎస్.అఫ్రీన్ అహ్మద్, త్రిలోకపావని, పి.సూర్యకళ, వి.పవిత్ర, శ్వేత, ఎస్.జీవిత, ఎస్.సుమియ తబుస్సమ్ కూడా ఉత్తమ పాయింట్లు సాధించారని చెప్పారు.

పాఠశాల అభివృద్ధికి సహకరిద్దాం : జడ్పీ సీఈవో



జడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న చిన్ననాటి స్నేహితులు

సోమల, జనవరి 14: నంజంపేట హైస్కూల్ అభివృద్ధికి పూర్వ విద్యార్థులు సహకరించాలని ఆ పాఠశాల పూర్వ విద్యార్థి, జడ్పీ సీఈవో ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం జరిగిన పాఠశాల స్వర్ణోత్సవ సభలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఈ బడిలో చదివిన పలువురు విద్యార్థులు విదేశాల్లో స్థిరపడి పాఠశాలకు గుర్తింపు తెచ్చారన్నారు. ఈనేపథ్యంలోనే 1974 నుంచి బడిలో చదువుకున్న పూర్వ విద్యార్థులు కలుసుకుని తమ జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో శివరత్న, సర్పంచు వెంకటరెడ్డి, ఎంపీటీసీ జిన్నా, విశ్రాంత హెచ్ఎం రంగారెడ్డి, లక్ష్మీనారాయణ, ప్రభాకరన్, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థి సంఘ నాయకులు పాల్గొన్నారు. స్వర్ణోత్సవాల్లో భాగంగా సోమవారం జరిగే కార్యక్రమాలకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరవున్నట్లు హెచ్ఎం కుసుమాంబ తెలిపారు. పాఠశాల ఆవరణలో వివేకానందస్వామి విగ్రహాన్ని ప్రారంభిస్తారని చెప్పారు.

మాజీ ఎంపీ రామకృష్ణారెడ్డికి ఘన నివాళి



పుంగనూరులో కేక్ కట్ చేస్తున్న టీడీపీ శ్రేణులు

పుంగనూరు, జనవరి 14:చిత్తూరు మాజీ ఎంపీ దివంగత రామకృష్ణారెడ్డి జయంతి సందర్భంగా పుంగనూరు ఎన్టీఆర్ సర్కిల్‌లో ఆదివారం ఆయన విగ్రహానికి టీడీపీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు మాట్లాడుతూ మాజీ ఎంపీ రామకృష్ణారెడ్డి బడుగు, బలహీనవర్గాల కోసం ఎనలేని కృషి చేశారని కొనియాడారు. మైనార్టీల అభివృద్ధికి పెద్దపీట వేసిన చరిత్ర ఆయనకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు షాజహాన్‌బాషా, రత్నమ్మ, వెంకటరమణ, మధుసూదన్ రాయల్, కేశవమూర్తి, ఖలీల్, ఆంజిరెడ్డి, చంద్ర, కుమార్‌రెడ్డి, అనీల్‌కుమార్, రాజు, రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

చౌడేపల్లె : స్థానిక టీడీపీ నాయకులు ఆదివారం బస్టాండు వద్దనున్న మాజీ ఎంపీ దివంగత రామకృష్ణారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కుమార్‌రెడ్డి, మునెంకటప్ప, రమేష్, విజయ్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాల్లో టోర్నీల జోరు



సోమల, జనవరి 14: సోమల హైస్కూల్ ఆవరణలో శనివారం రాత్రి శివాలయం రాయల్స్ ఆధ్వర్యంలో బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు జరిగాయి. 34 జట్లు పోటీల్లో పాల్గొనగా సోమల టీచర్ దామోదరం, ప్రేమ్‌చంద్ జట్టు విజేతగా నిలిచి రూ. 10వేలు నగదు బహుమతిని దక్కించుకుంది. పీడీ కరుణానిధి, జగ్గూబాయి పోటీలను పర్యవేక్షించారు. సోమల, సూరయ్యగారిపల్లె, కందూరు, నెల్లిమంద,నంజంపేట, నడింపల్లెలలో టోర్నీలు జరిగాయి. అలాగే సోమల హైస్కూల్‌లో శివాలయం రాయల్స్ క్రికెట్ టోర్నమెంట్, జూనియర్ కళాశాలలో స్వర్గీయ పెద్దిరెడ్డి భాస్కర్‌రెడ్డి స్మారక టోర్నీ హోరాహోరాగా సాగుతున్నాయి.

కర్ణాటక మద్యం విక్రేత అరెస్టు

గుడుపల్లె, జనవరి 14: మండలంలోని ఎ.కొత్తపల్లెలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న మహిళను అరెస్టు చేసినట్లు కుప్పం ఎస్ఈబీ సీఐ పాల కిషోర్‌కుమార్ తెలిపారు. ఎ.కొత్తపల్లె కాలనీలోని చిల్లర దుకాణంలోకొన్ని రోజులుగా కర్ణాటక మద్య విక్రయం సాగుతోందని ఎస్ఈబీ పోలీసులకు గ్రామస్తులు సమాచారం అందించారు. ఎస్ఈబీ సీఐ తన సిబ్బందితో ఆదివారం దాడులు నిర్వహించారు. 40 పాకెట్ల మద్యాన్ని స్వాధీనం చేసుకొని, ఆమెను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.



వైభవంగా భోగి పండుగ సంబరాలు


కుటుంబ సభ్యులతో కలిసి భోగి మంట వేస్తున్న మంత్రి రోజా


నగరి, జనవరి 14: నగరి మండలం, పట్టణ పరిధిలో ఆదివారం భోగి పండుగ సందర్భంగా వేకువఝామున 1.30 గంటల నుంచే ప్రజలు భోగి మంటలు వేసి సంబరాలు జరుపుకున్నారు. మంత్రి రోజా తన స్వగృహంలో కుటుంబ సభ్యులతో కలిసి భోగి మంటలు వేశారు.

విజయపురం: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం వేకువజామున భోగిమంటలతో సంక్రాంతి సంబరాలు మొదలయ్యాయి. నూతన వస్త్రాలు, ఇంటికి కావలసిన కిరాణ వస్తువుల కోసం గ్రామాల నుండి పట్టణాలకు వెళ్లడంతో సందడిగా మారింది. గ్రామాలలో పిల్లలకు ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి సంక్రాంతి సందడిని ప్రారంభించారు. సంక్రాంతి ముగ్గులు అబ్బురపరచాయి. మండలంలోని జంబాడ, విజయపురం, కోసలనగరం, పాతార్కాడు, మహారాజపురంలో యువతకు వివిధ క్రీడలు నిర్వహించారు.

వెదురుకుప్పం: వెదురుకుప్పం మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం భోగి మంటలను వేశారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడి సొంత గ్రామాలకు చేరుకున్న వారు బంధు, మిత్రులతో కాలక్షేపం చేశారు. గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది.

గోదాదేవి కల్యాణం

నగరి, జనవరి 14: నగరి పట్టణ పరిధిలోని పెరుమాళ్‌గుడిలో గోదాదేవి కల్యాణోత్సవం ఆదివారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి ఆర్‌కే రోజా సతీసమేతంగా పాల్గొనగా, భక్తులు హాజరయ్యారు.



చెరకు తోట దగ్ధం

● రూ.3 లక్షల ఆస్తి నష్టం

పాలసముద్రం, జనవరి 14: మండలంలోని గంగమాంబాపురానికి చెందిన మణికంఠన్ అనే రైతుకు చెందిన మూడున్నరెకరాల చెరకుతోట ఆదివారం కాలి బూడిదైంది. మణికంఠన్ పొలానికి కొద్దిదూరంలో ఉన్న మరో రైతు తన పొలంలో చెరకు నరికిన తర్వాత ఉన్న ఆకులను కాల్చివేయడానికి నిప్పుపెట్టారు. గాలికి నిప్పురవ్వలు ఎగిసిపడి మణికంఠన్‌కు చెందిన చెరకుతోట పూర్తిగా దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బందికి తెలియజేసినా, వారొచ్చేలోగా పూర్తిగా చెరకుతోట కాలిపోయిందని, సుమారు రూ.3 లక్షల వరకు నష్టం వాటిల్లిందని రైతు వాపోయారు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని ఆయన కోరారు.









నిత్యావసర వస్తువుల పంపిణీలో 15వ స్థానంలో చిత్తూరు

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 14: నిత్యావసర వస్తువుల పంపిణీలో ఆదివారం నాటికి చిత్తూరు రాష్ట్రస్థాయిలో 15వ స్థానంలో నిలిచింది. 5,41,703 కార్డులకు గాను ఇంతవరకు 4,58,240 కార్డులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేసి 84.59 శాతం సాధించింది. పోర్టబిలిటీ ద్వారా 78,415 మందికి ఎండీయూ వాహనాల ద్వారా నిత్యావసర వస్తువుల పంపిణీ కొనసాగింది.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

ఐరాల(కాణిపాకం), జనవరి 14: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈవో వెంకటేశు అన్నారు. ఆదివారం కాణిపాకంలో స్వచ్ఛతీర్థ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆలయ ఉద్యోగ, సిబ్బంది మాడవీధులు, అనుబంధ ఆలయాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఈ నెల 21వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈఈ వెంకటనారాయణ, ఏఈవోలు ఎస్వీ.కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, హరిమాధవరెడ్డి, సూపరింటెండెంట్లు వాసు, కోదండపాణి పాల్గొన్నారు.


మాడవీధులలో శుభ్రం చేస్తున్న చైర్మన్, ఈవో





